సాక్షి
వికారాబాద్
గురువారం ၊ 18 ၊ మే ၊ 2023



రాయితీలకు మంగళం
రైతు బంధు పథకంతో రాష్ట్ర ప్రభుత్వం రాయితీలకు మంగళం పాడింది. ఎకరాకు రూ. 5వేలు ఇచ్చి మిగతా సౌకర్యాలు రద్దు చేసింది. 8లో▸



చిత్తశుద్ధి ఏదీ?
ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్న నిబంధన పెడుతున్నా, ఆర్టీఏ, పోలీస్ శాఖల్లో చిత్తశుద్ధి కరువైంది. 8లో▸



దిగుబడి బాగుంది..
వరి పండించిన రైతులకు ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. దిగుబడి బాగున్నప్పటికీ.. పెట్టుబడి అదే స్థాయిలో పెరిగింది. 9లో▸

న్యూస్‌రీల్

20న వాక్ ఇన్ ఇంటర్వ్యూ



అనంతగిరి: జిల్లాలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఖాళీగా ఉన్న 14 మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్ 2020 తర్వాత బ్యాచ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 20న ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హాజరుకావాలన్నారు.

31వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె



ఆర్డీఓ కార్యాలయం ఎదుట వీఓఏల నిరసన

అనంతగిరి: ఐకేపీ వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారానికి 31వ రోజుకు చేరుకుంది. ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం దిగివచ్చే దాకా ఉద్యమం ఆగదన్నారు. ప్రభుత్వం వెంటనే డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభు, రాంరెడ్డి, లక్ష్మి, దేవన్న, పల్లవి, మమత , సుజాత, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



పాలీసెట్ సెంటర్ వద్ద విద్యార్థులు

అనంతగిరి: పాలిసెట్ బుధవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వర్ తెలిపారు. వికారాబాద్‌లోని 3 (భృంగి స్కూల్, ఎస్ఏపీ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్) సెంటర్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 1,548 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,425 మంది హాజరయ్యారని, 123మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త షాపు ధ్వంసం
పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు, న్యాయవాది

బషీరాబాద్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సందీప్ సుగంధీకి చెందిన సెల్‌ఫోన్, ఎలక్ట్రికల్ షాపును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం షాపు తెరవడానికి వెళ్లగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. షాపులోని సామగ్రి చిందరవందరగా పడేశారు. కౌంటర్ అద్దాలు పగలగొట్టారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.23 వేలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తన షాపును బీజేపీ నాయకులే ధ్వసం చేయించారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చేవెళ్ల ఆర్డీఓకు వెండి పతకం



వెండి పతకం, జాతీయ పతాకంతో వేణుమాధవ్‌రావు

చేవెళ్ల: సౌత్ కొరియాలో ఈ నెల 15, 16వ తేదీల్లో జరిగిన ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్-2023 జూరీస్ తరఫున సీనియర్ క్యాడర్ ట్రిపుల్ జంప్ పోటీల్లో చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు వెండి పతకం సాధించారు. బుధవారం ఆయనకు సోషల్ మీడియా వేదికగా మండల అధికారులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల ఆర్డీఓ దేశం తరఫున పోటీలో పాల్గొని పతకం సాధించారు.

ఇవేం ఎండలు బాబోయ్..!



సూర్యుడి ప్రతాపానికి జనం అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తెకు ముందే రోళ్లు పగులుతున్నాయి.. 'ఇవేమి ఎండలు బాబోయ్ అంటూ జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. మరో రెండు, మూడు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరగవచ్చని, ఎండల తీవ్రత దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ఎవరూ బయట తిరగరాదని అధికారులు సైతం హెచ్చరిస్తున్నారు. వడగాడ్పులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. ఇటీవల అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలుల వల్ల ఉష్ణోగ్రతలు పడిపోగా, వారం రోజులుగా సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు.

భానుడు భగభగ.. జనం విలవిల
- జిల్లాలో గరిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు
- యాలాలలో అత్యధికంగా 41.8 డిగ్రీలు నమోదు
- వడగాడ్పులు, ఉక్కపోతతో ప్రజల అవస్థలు

తాండూరు: మూడేళ్ల తర్వాత జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వారం రోజుల క్రితం 35 డిగ్రీల నుంచి 39 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతూ వస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే దడపుట్టించేలా వేడి పుట్టిస్తోంది. ఈ వేసవి సీజన్‌లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. యాలాలలో 41.8 డిగ్రీల అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుల్కచర్లలో 40.9, తాండూరులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదై ఈ వేసవిలో రికార్డు సృష్టించాయి. ఇటీవల రాత్రి పగలు అనే తేడా లేకుండా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఉక్కపోతతో ఇంట్లో ఉండలేక.. ఎండ వేడికి బయటకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఇటీవల అడపాదడపా వర్షాలతో ఉపశమనం పొందిన ప్రజలు ప్రస్తుతం పెరిగిన ఉష్ణోగ్రతలతో బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం నుంచే ప్రారంభమైన ఎండలు సాయంత్రం 6 దాటినా తగ్గుముఖం పట్టడం లేదు. మరోవైపు వడగాడ్పులతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు.

ఆరెంజ్ జోన్‌లో మూడు మండలాలు..

వాతావరణ శాఖ ఉష్ణోగ్రతలను నాలుగు విభాగాలుగా లెక్కిస్తుంది. 35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైతే గ్రీన్ జోన్, 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఎల్లో జోన్, 40 నుంచి 45 డిగ్రీల లోపు నమోదైతే ఆరెంజ్ జోన్‌గా, 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటితే రెడ్ జోన్‌గా పరిగణిస్తారు. అయితే ఇప్పటికే ఆరెంజ్ జోన్‌లోకి మూడు మండలాలు చేరుకున్నాయి. మిగతా మండలాలు ఎల్లో జోన్‌లో ఉన్నాయి. ఉష్ణోగ్రతలు మరిత అధికమయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

నిలువ నీడ కరువు

గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు సేద తీరేందుకు స్థలం కరువైంది. గతంలో పార్కులలో చెట్ల కింద సేదతీరేవారు. ప్రస్తుతం పార్కుల నిర్వహణ సరిగా లేకపోవడంతో నీడ లేకుండా పోయింది. దేవాలయాల ల్లోనైనా సేద తీరేందుకు వెళదామంటే మధ్యాహ్నం 12 గంటలకే అధికారులు తాళాలు వేసుకొని వెళుతున్నారు. గతంలో భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎండా కాలంలో సేదతీరేవారు. వేసవి సమయంలో ఆలయ ప్రాంగణాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

'డబుల్' వేగిరం



ఇళ్ల వద్దకే వచ్చి దరఖాస్తు దారులను విచారిస్తున్న అధికారులు

ఇళ్ల పంపిణీకి కసరత్తు
- పూర్తికావొచ్చిన లబ్ధిదారుల ఎంపిక
- నిర్మాణ దశలో ఉన్న ఇళ్లు 1,031
- వచ్చిన దరఖాస్తుల సంఖ్య 12,205
- నిరుపేదలకే అధిక ప్రాధాన్యం
- ఈ నెలాఖరులో అన్ని పనులు పూర్తిచేయాలి: కలెక్టర్

వికారాబాద్: డబుల్‌బెడ్రూం ఇళ్ల త్వరితగతిన పేదలకు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కలెక్టర్ నారాయణరెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అవుతున్న గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పేదలనుంచి దరఖాస్తులు ఇప్పటికే స్వీకరించారు. ఆ వెంటనే ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో ముగ్గురు చొప్పున టీంలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికీ వెళ్లి ఎవరు అర్హులు? ఎవరు కాదు అనే విషయంపై విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే వచ్చిన దరఖాస్తుల్లో 10 శాతం లోపే ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. వచ్చిన దరఖాస్తుల్లో 50 శాతం అర్హులు ఉన్నట్టు అధికారుల విచారణలో తేలింది. దీంతో కలెక్టర్ అర్హుల జాబితాను మరింత తగ్గించేందుకు మరోమారు విచారణ చేపట్టాలని దేశించినట్టు సమాచారం.

1031 ఇళ్లకు తుది మెరుగులు..

జిల్లాలో 1031 ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం కూడా నిర్మాణాలు పూర్తి అవుతున్న ఇళ్లను అర్హులకు కేటాయించే ప్రక్రియపై దృష్టి సారించింది. ముందుగా పూర్తి అయిన ఇళ్ల నిర్మాణ పనులపై దృష్టి సారించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ నారాయణరెడ్డి ఇప్పటికే సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడం.. వాటిని పేదలకు పంపిణీ చేసే ప్రక్రియలో పాటించాల్సిన విధివిధానాలు తహసీల్దార్లు, ఆర్డీఓలకు వివరించారు. అందులో కరెంటు, నీటి సౌకర్యం తదితర పనులు వెంటనే పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు.

ఇళ్ల సంఖ్య కుదింపు

జిల్లాకు మొదట్లో 5,740 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. 2016లో ఈ రెండు పడకల గదుల నిర్మాణ పనులకు భూమి పూజలు చేశారు. తరువాత వాటి సంఖ్యను 3,800కు కుదించారు. ప్రస్తుతం ఇందులో 2,257 ఇళ్ల నిర్మాణ దశలో ఆయా స్థాయిల్లో ఉన్నాయి. వీటిలో 1031 ఇళ్ల చిన్న చిన్న పనులు మినహా పూర్తి అయ్యాయి. 1,543 ఇళ్లు ఇంకా ప్రారంభించలేదు. దారూరులో 120, మర్పల్లిలో 120, యాలాల మండలం కోకట్‌లో 180, తాండూరు పట్టణంలో 401, పరిగిలో 180, చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో 30 మొత్తం 1031 ఇళ్లను పేదలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి దరకాస్తులు స్వీకరించారు. అందుబాటులో ఉన్న ఇళ్లకు పదింతలు ఎక్కువగా 12,205 దరఖాస్తులు వచ్చాయి.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితా తయారు చేశారు. చేసుకున్న దరఖాస్తుల్లో 50 శాతం మేర అర్హులు తేలడంతో మరోమారు స్క్రీనింగ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ దఫా పీటీజీ(నిరుపేదలు) కుటుంబాలను మాత్రమే అర్హుల జాబితాలో చేరుస్తున్నారు. ఈ లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను ఎమ్మెల్యేల సమక్షంలో తహసీల్దార్లు పర్యవేక్షించనున్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

పేదలకే ప్రాధాన్యం

డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం మండల, డివిజన్ స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. త్వరలో 1031 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించడంతో పాటు పేదలే పరమావధిగా ఎంపిక జరిగేలా చూస్తున్నాం

– నారాయణరెడ్డి, కలెక్టర్

అర్హులందరికీ ఇవ్వాల్సిందే



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నేత మల్లేశ్

పరిగి: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్‌బెడ్రూంలు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ డివిజన్ కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఏ పథకం అమలు చేస్తున్నా నిజమైన అర్హులకు అందడం లేదన్నారు. ఇల్లు లేని, భూమి లేని నిరుపేదలకే ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం తగదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బర్త్‌డే సంబురం

కలెక్టర్ నారాయణరెడ్డి జన్మదినం వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమక్షంలో కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌ను బొకేలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌డీఓ అశోక్‌కుమార్, ఆర్‌డీఓ విజయకుమారి, కార్యాలయం ఏఓ అమరేందర్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

– వికారాబాద్ అర్బన్

5 నుంచి నిరవధిక సమ్మె చేపడతాం

- రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాల్సిందే
- సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జుకారెడ్డి



అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనట్లయితే వచ్చే నెల 5 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జుకారెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా నాయకులు అదనపు కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా డీలర్లకు వేతనం ఇవ్వాలని, రూ.10లక్షల ఇన్సురెన్స్ అమలు చేయాలన్నారు. ప్రతి ఎంఎల్‌సీ పాయింట్‌లో వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, శాశ్వత ఆథరైజేషన్ ఇవ్వాలని కోరారు. కారుణ్య నియామకాలు 50 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇతర నిత్యావసర సరుకులు సైతం పంపిణీ చేయాలన్నారు. డీలర్ చనిపోతే దహన సంస్కరణలకు రూ.50వేల సాయం అందించాలని కోరారు. క్వింటాలుకు ఒక శాతం తరుగు ఇవ్వాలన్నారు. ఖాళీ గన్ని సంచుల ధర రూ.30 కు పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణం చొరవచూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విఠల్, రాజు, నాగిరెడ్డి, రమేశ్, అంజయ్య, గోపాల్, నాగరాజు, చెన్నయ్య, వెంకటేశ్, కిష్టయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మహేశ్వరం



కేసీతండాలో ప్రభుత్వ డైట్ కాలేజ్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

మహేశ్వరం: నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మహేశ్వరంలోని కేసీతండా సమీపంలో రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన డైట్ కాలేజీ, రూ.1.70 కోట్లతో నిర్మిస్తున్న మోడల్ స్కూల్ మొదటి అంతస్తు భవనం, కస్తూర్బా పాఠశాలలో 2.30 కోట్లతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణానికి బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని స్పష్టంచేశారు. మహేశ్వరం మోడల్ స్కూల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు నాసా పోటీలకు ఎంపిక కావడంపై మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారన్నారు. ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డైట్, మెడికల్ కాలేజీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, మోడల్ స్కూళ్ల ద్వారా మహేశ్వరం విద్యాభివృద్ధిలో ముందుందని తెలిపారు. ఆలయాలు, రోడ్లకు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, జాయింట్ కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఈఓ సుశీంధర్‌రావు, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతానాయక్, కేసీతండా సర్పంచ్ మోతిలాల్‌నాయక్, ఎంఈఓ కృష్ణ, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బి.ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'పై అవగాహన

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య శాఖ కార్యదర్శి కరుణ, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. కరోనా సమయంలో పిల్లలకు విద్యపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం తొలిమెట్టును ప్రవేశ పెట్టిందని స్పష్టంచేశారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్జీఓల సహకారంతో గ్రామాల్లో వలంటీర్లను నియమించి చదువులో వెనకబడి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డితో పాటు యాదాద్రి, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగుతన్నాయని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేశామన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

- పీడీయాక్ట్ నమోదు చేస్తాం
- ఎస్పీ కోటిరెడ్డి హెచ్చరిక



పాల్గొన్న వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు

అనంతగిరి: నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ కోటిరెడ్డి హెచ్చరించారు. బుధవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసు అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాల నుంచి రైతులను కాపాడుకొనే బాధ్యత మనందరిపై ఉందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినా, నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులకు సహాయం చేసినా వారిపై కఠినమైన చర్యలు తీసుకొని పీడీ యాక్టు నమోదు చేస్తామని తెలిపారు. పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు విత్తనాలను లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన అనంతరం తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, డీఎస్పీ సత్యనారాయణ, కరుణాసాగర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ఏడీఏ వినోద్‌కుమార్, శంకర్ రాథోడ్, రుద్రమూర్తి, లక్ష్మీకుమారి, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నేర సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రైం రివ్యూ, కోర్టు మానిటరింగ్ సిస్టం, రోడ్డు ప్రమాదాలు ఎన్‌ఫోర్స్‌మెంట్, తదితర వాటిపై సమీక్షించారు. జిల్లాలో నమోదయిన కేసుల వివరాలను, పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాత్రి సమయంలో విధులలో ఉండే పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళ వాహనాల తనిఖీ, పెట్రోలింగ్‌లు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. అక్రమ ఇసుక, గుట్కా, పీడీఎస్ రైస్‌ను అరికట్టాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగునకు కృషి చేద్దాం

బొంరాస్‌పేట: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేద్దామని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రానున్న వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

వీఓఏల డిమాండ్లు తీర్చాలి


దీక్ష చేస్తున్న వీఓఏలు

కడ్తాల్: ఇందిరా క్రాంతి పథంలో పనిచేస్తున్న వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే తీర్చాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కందికంటి లావణ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారానికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. వీఓఏలుగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గ్రామ స్థాయిలో మహిళల అభ్యున్నతికి ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి, ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామన్నారు. సర్వేలు, ఆన్‌లైన్ పనులు అంటూ పని భారం పెంచుతూ తగిన వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు జానకీరాములు, కార్యదర్శి వనిత, కోశాధికారి జంగయ్య తదితరులు ఉన్నారు.

యువకుడిపై రౌడీషీట్

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బాటాసింగారం గ్రామానికి చెందిన ఎం సాయి కార్తీక్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సాయి కార్తీక్‌పై ఇప్పటికే ఐదు కేసులు నమోదు కాగా.. తాజాగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నట్లు మరో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసులు కార్తీక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. కార్తీక్‌పై 2019లో రేప్ కేసు, 2022లో దోపిడీ, ఇంట్లోకి చొరబడిన కేసు, ఈ ఏడాది దాడి చేసిన ఘటనపై కేసులు నమోదయ్యాయి. తాజాగా ఇద్దరు బాలికలను ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జైలులో ఉన్న కార్తీక్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో వనస్థలిపురం ఏసీపీ ఆదేశాలతో సాయి కార్తీక్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ తెలిపారు.

ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ రంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ ఫౌండేషన్ కోర్సు ఒకటవ బ్యాచ్ ఐదు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 17 నుంచి వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 21వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బషీర్‌బాగ్ నిజాం కాలేజీలో నిర్వహించే అర్హత పరీక్షకు హాజరుకావాలని కోరారు.

ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు

షాద్‌నగర్: ఈతకు వెళ్లిన వ్యక్తి చెరువులో దిగి గల్లంతైన ఘటన బుధవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కంసాన్‌పల్లికి చెందిన సాయిలు(40) కొడుకుతో కలిసి గ్రామ శివారులోని చెరువులో ఈత కొట్టడానికి వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. అక్కడ ఉన్న వారు విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. బంధువులు చెరువులో సాయిలు కోసం వెతికారు. కానీ ఆచూకీ కనిపించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపు ఆపేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయితీలకు మంగళం

- 'రైతు బంధు' ఇచ్చి సౌకర్యాలు రద్దు
- తొమ్మిదేళ్లుగా అమలు కాని 'రిబేటు'
- భారంగా మారిన పంట రుణాలు
- ఇబ్బందుల్లో అన్నదాతలు

కొడంగల్: రైతు బంధు పథకం అమలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం రాయితీలకు మంగళం పాడింది. ఎకరాకు రూ. 5వేలు రైతు బంధు ఇచ్చి మిగిలిన సౌకర్యాలను ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులకు అన్యాయం జరుగుతోంది. ప్రతి గ్రామంలో రైతులు వ్యవసాయ సహకార సంఘాలు, బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మిత్తిలో రాయితీ (రిబేటు) పథకానికి శ్రీకారం చుట్టారు. రుణం తీసుకున్న రైతులు సకాలంలో బ్యాంకులకు కిస్తులు కడితే ఆరు శాతం రిబేటును ప్రభుత్వం చెల్లించేది. బ్యాంకులకు చెల్లించాల్సిన మిత్తిలో సగ భాగం ప్రభుత్వమే భరించేది. అప్పట్లో బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో అంటే మార్చి 31వ తేదీ లోపు కిస్తులు చెల్లించి రిబేటు పొందేవారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత కొంతకాలం రిబేటు పథకాన్ని కొనసాగించారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రైతులకు రిబేటు ఇవ్వడం లేదు. దీంతో వేలాది మంది రైతులకు నష్టం జరుగుతోంది. కొడంగల్ పీఏసీఎస్‌లో సుమారు 120 మంది రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. వారిలో మార్చి 31వ తేదీ లోపు క్రమం తప్పకుండా 55 మంది రైతులు కిస్తులు చెల్లించారు. వారు చెల్లించిన మిత్తిలో ఆరు శాతం రిబేటు రావాలి. కానీ ప్రభుత్వం రిబేటు పథకానికి నిధులు కేటాయించక పోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతోంది. ఇలాంటి రైతులు జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది.



కొడంగల్ పీఏసీఎస్ కార్యాలయం

ఏక కాలంలో రుణమాఫీ చేయాలి

2018 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ రెండో సారి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. అయితే ఏకకాలంలో రుణ మాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ చేయడం వల్ల నియోజకవర్గంలో రూ. 80కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరింది. ఈ సారి అంతకంటే అధికంగా రుణమాఫీ వచ్చే అవకాశం ఉంది. చిన్న, సన్నకారు రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు. 15 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రుణమాఫీ కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో రైతులకు ఇచ్చిన పంట రుణాల వివరాలు పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. కొడంగల్ డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 6వేల మంది రైతులకు పంట రుణాలు ఇచ్చారు. గ్రామీణ వికాస్ బ్యాంకులో సుమారు రూ. 32కోట్ల వ్యవసాయ రుణాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. స్టేట్ బ్యాంకులో రూ. 16కోట్లకు పైగా వ్యవసాయ రుణాలు ఇచ్చారు. యూనియన్ బ్యాంకులో సుమారు రూ. 10కోట్లకు పైగా రుణాలు ఇచ్చారు. కొడంగల్‌తో పాటు దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో పలు బ్యాంకులు, సహకార సంస్థలు రైతులకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చాయి.

రిబేటు రావడం లేదు



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల కోసం పనిచేస్తున్నాయి. గతంలో రిబేటు వచ్చేది. ప్రస్తుతం రావడం లేదు. ప్రభుత్వం రిబేటు చెల్లిస్తే రైతులకు మేలు జరుగుతుంది. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి ఊరట కలుగుతుంది.

– శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్, కొడంగల్

'వీరశైవ' ఎన్నికల నోటిఫికేషన్

తాండూరు: వీరశైవ సమాజం నూతన కమిటీ ఎన్నికలకు బుధవారం ఆ సమాజం సభ్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ, 22న నామినేషన్ల పరిశీలన, జాబితా విడుదల, 23వ తేదీ మధ్యాహ్నం వరకు నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం 6గంటలకు జాబితాలోని అభ్యర్థులకు లాటరీ పద్ధతిన క్రమ సంఖ్యల కేటాయింపు, జూన్ 4వ తేదీ ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు, అనంతరం విజయం సాధించిన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వీరశైవ సమాజం ఎన్నికల అధికారి నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల కార్యాలయం ఉదయం 10 నుంచి ఒంటి గంటల వరకు, అలాగే సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న సభ్యులు సమయపాలన పాటించాలన్నారు. వీరశైవ సమాజంలో సభ్యత్వం పొందిన కుటుంబాలు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సమాజం సభ్యులు సహకరించాలని కోరారు.


ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్న వీరశైవ సమాజం ప్రతినిధులు

యువతి వేధింపులతో వ్యక్తి బలవన్మరణం

- వివాహితుడిని పెళ్లి చేసుకోవాలని కోరిన అమ్మాయి
- నిరాకరించిన వ్యక్తి
- అయినా మాట వినని యువతి

పరిగి: తనను పెళ్లి చేసుకోవాలని ఓ యువతి వివాహితుడిని పదేపదే కోరడం, అందుకు ఆ వ్యక్తి నిరాకరించడం, అయినా ఆ అమ్మాయి మాట వినకపోవడంతో మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. యాబాజీగూడకు చెందిన కుమార్(29) కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నగరంలోని ఓ అమ్మాయి తనను పెళ్లి చేసుకోవాలని కుమార్‌ను నిత్యం వెంట పడుతుండడంతో నిరాకరించాడు. అయినా పదే పదే పెళ్లి చేసుకోవాలని ఆ అమ్మాయి కోరడంతో ఆందోళన చెందిన కుమార్ సొంత గ్రామం యాబాజీగూడకు వచ్చి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంఘం భూమిని ఆక్రమిస్తే చర్యలు

చేనేత, ఉన్ని, జౌళి శాఖ హైదరాబాద్ ప్రాంతీయ ఉప సంచాలకులు వెంకటేశం


చేవెళ్లలోని ఉన్ని పరిశ్రమను సందర్శించిన వెంకటేశం, ఇందిర తదితరులు

చేవెళ్ల: పట్టణంలోని ఉన్ని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘానికి సంబంధించిన భూమిని కొందరు ఆక్రమించారని, దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని చేనేత, ఉన్ని, జౌళి శాఖ హైదరాబాద్ ప్రాంతీయ ఉప సంచాలకులు వెంకటేశం తెలిపారు. బుధవారం ఆయన చేవెళ్లలోని ఉన్ని చేనేత పరిశ్రమను సహాయ అధికారి వి.ఇందిరతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. చేవెళ్లలోని సర్వే నంబర్ 3లో ఉన్ని చేనేత సహకార సంఘానికి ప్రభుత్వం 2 ఎకరాల 10 గుంటల భూమి కేటాయించిందని తెలిపారు. ఇక్కడే పరిశ్రమ కొనసాగుతోందని చెప్పారు. అయితే ఈ స్థలానికి చుట్టూ కంచె లేకపోవడంతో కొందరు నాయకులు, ప్రజలు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఈ భూమిపై అన్ని హక్కులు ఉన్ని సంఘానికే ఉన్నాయన్నారు. పలుమార్లు సర్వే చేయించి హద్దులు నిర్ణయించినా ఈ భూమిలోకి అక్రమంగా చొరబడి ఇళ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో ఈ స్థలం చుట్టూ కంచె వేస్తామన్నారు. చేనేత, ఉన్ని కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉన్ని సహకార సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, కార్యదర్శులు సత్తయ్య, మాణిక్యం, మల్లయ్య, రాంచందర్, సభ్యులు వెంకటయ్య, కిష్టయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఏదీ..?

- హెల్మెట్ల వినియోగంపై అడపాదడపా హడావుడి
- ఆ తర్వాత పట్టించుకోని ఆర్టీఏ, పోలీస్ శాఖలు
- హెల్మెట్లు కొంటున్న 70శాతం మంది
- 10శాతానికి మించి వాడని వైనం
- రోజురోజుకూ పెరుగుతున్న టూవీలర్ ప్రమాద మృతులు
- 90శాతం మృతుల్లో హెల్మెట్ లేకపోవడమే కారణం


హెల్మెట్ల వాడకంపై ఇటీవల నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, పోలీసులు

వికారాబాద్: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలి.. ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆర్టీఏ, పోలీస్ శాఖలపై ఉంది. కానీ ఆ దిశగా అధికారులు చొరవ చూపడం లేదు. టూ వీలర్ నడిపే వారిలో చైతన్యం తెచ్చే ప్రయత్నాలు చేయడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాల సమయంలో హడావుడి చేయడం ఆ తరువాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. అప్పుడు కూడా హెల్మెట్ మాట ఎత్తడం లేదు. వాహన లైసెన్సులు, ఆర్‌సీ బుక్, ఇన్సూరెన్స్ వంటి వాటి గురించి అడిగి వదిలేస్తున్నారు. ఇదీ.. గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు, ఆర్టీఏ అధికారుల పని తీరు. అయితే అడిగే వారు లేరు కదా అని వాహనదారులు కూడా హెల్మెట్ల వినియోగంపై అంత శ్రద్ధ పెట్టడం లేదు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పనులు సకాలంలో పూర్తి కావాలన్నా.. విధులకు చేరుకోవాలన్నా దిచక్రవాహనం తప్పని సరి. ఈ పరిస్థితుల్లో ఉదయం ఇంటి నుంచి వెళ్లిన మనిషి తిరిగి వచ్చేంత వరకు నమ్మకం లేకుండా పోయింది. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి నాలుగు నిమిషాలకో వ్యక్తి మృత్యువాత పడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. నమోదవుతున్న నేరాల్లో రోడ్డు ప్రమాదాలే సింహ భాగంలో ఉంటున్నాయి. ఇటీవలి కాలంలో టూ వీలర్ల ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న సంఘటనలు కోకొల్లలు. ఇందులో కేవలం హెల్మెట్ లేని కారణంగానే 90 శాతం మంది చనిపోతున్నారని పోలీసులు, ఆర్టీఏ అధికారులు ధ్రువీకరిస్తున్నారు.

హెల్మెట్టే శ్రీరామరక్ష

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్టే శ్రీరామ రక్ష. వందలో 70శాతం మంది హెల్మెట్లు కొంటున్నా.. 10శాతం మంది కూడా వాడడం లేదు. 90శాతం మంది హెల్మెట్ లేని కారణంగానే మృత్యువాత పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అర్బన్ ప్రాంతాల్లో 50శాతం మేర హెల్మెట్లు వాడుతున్నారు. పోలీసుల తనిఖీల కారణంగా హెల్మెట్ల వాడకం మరింత పెరిగింది.

నిరంతర ప్రక్రియ కావాలి

హెల్మెట్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిరంతర ప్రక్రియ కావాలి. పోలీసులు, ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేయడం తోపాటు, అవగాహన కల్పించాలి. అలాగే ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు హెల్మెట్ల వాడకంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలి.

ప్రజల్లో మార్పు రావాలి



ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు అవసరమో ముందుగా తెలుసుకోవాలి. పోలీసుల కోసం కాకుండా వ్యక్తిగత రక్షణ కోసం హెల్మెట్ వాడాలి. హెల్మెట్ల వినియోగంపై తమ వంతు ప్రచారం, అవగాహన కల్పిస్తున్నాం. కానీ చాలా మంది ట్రాఫిక్ రూల్స్ పాటించడం లేదు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధపడడం కంటే రక్షణ చర్యలు తీసుకొని సురక్షితంగా బయటపడడం అలవాటు చేసుకోవాలి.

– కోటిరెడ్డి, ఎస్పీ, వికారాబాద్

గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం


కందుకూరు: చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- రెండోసారి నియమితులైన సందర్భంగా పలువురి శుభాకాంక్షలు

మీర్‌పేట: రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి బుధవారం తెలిపారు. డీసీసీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన సందర్భంగా ఆయన మాట్లాడారు.. తనపై మరింత బాధ్యత పెరిగిందని, కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి పోరాటం చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

శుభాకాంక్షలు

కందుకూరు: డీసీసీ అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన చల్లా నర్సింహారెడ్డికి ఆ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పార్టీ మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎండీ అఫ్జల్‌బేగ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు పాండురంగారెడ్డి తదితరులు చల్లాను పార్టీ కార్యాలయంలో కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకునే వరకు విశ్రమించేదిలేదని ఈ సందర్భంగా చల్లా తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఖాజా మొయినుద్దీన్, నాయకులు సభావత్, గణేష్‌నాయక్, బాబు, వెంకటేష్, రాములు, ముత్యంరెడ్డి, జగన్, దర్శన్, రాజేందర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రభు, నయీమ్, మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరిట దోపిడీ

యాచారం: మంతన్‌గౌరెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తరుగు పేరుతో తమ కష్టాన్ని దోచుకుంటున్నారని రైతులు మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులు 40 కిలోల బస్తాకే 4కిలోల తరుగు పేరుతో ధాన్యాన్ని అధికంగా నింపుతున్నారని, ఇదేమని అడిగితే మీ ఇష్టం ఉంటే అమ్మండి.. లేదంటే వెళ్లిపోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆందోళన చేపట్టారు. రైతుల ఆందోళనకు మద్దతుగా కాంగ్రెస్, సీపీఎం పార్టీలు మద్దతు ప్రకటించి ధర్నాలలో పాల్గొన్నారు. అధికారులు వచ్చే వరకు ధాన్యం కొనుగోళ్లు నిలిపేయాలని రైతులు మొండికేశారు. ఇప్పటికే గ్రామంలో వందలాది క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ముంచారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి మంతన్‌గౌరెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఏసీబీ వలలో జేఎల్ఎం

మొయినాబాద్: విద్యుత్ మీటరు ఇవ్వడానికి జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. మొయినాబాద్ మండలం బాకారంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ వ్యక్తి బాకారం గ్రామంలో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన ప్రతాప్‌ను సూపర్‌వైజర్‌గా నియమించి పొలం పనులు చూసుకుంటున్నాడు. ఆ భూమిలో ఓ గది నిర్మించారు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయగా మీటరు మంజూరైంది. బాకారం జూనియర్ లైన్‌మెన్ వీరకర్ణ మీటర్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేశాడు. దీంతో ప్రతాప్ మార్చి నెలలో రూ. 10 వేలు ఇచ్చాడు. అయినా కనెక్షన్ ఇవ్వలేదు. మీటర్ ఇవ్వాలంటే మరో రూ. 5వేలు కావాలని జేఎల్ఎం డిమాండ్ చేశారు. దీంతో ప్రతాప్ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు బుధవారం రూ. 5వేలు ఇస్తానని.. తన వ్యవసాయ క్షేత్రం వద్దకు రావాలని ప్రతాప్.. జూనియర్ లైన్‌మెన్‌కు చెప్పాడు. మధ్యాహ్నం 12గంటల సమయంలో జేఎల్ఎం వీరకర్ణ వ్యవసాయ క్షేత్రానికి వచ్చి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 5వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరకర్ణను మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తరలించారు. సుమారు 4 గంటలపాటు సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. గురువారం నిందితున్ని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

చెరువు పరిరక్షణకు న్యాయపోరాటం


చెరువును రక్షించాలంటూ నినాదాలు చేస్తున్న సంఘం సభ్యులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు సుందరీకరణకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసినా.. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెరువు అన్యాక్రాంతం అవుతోందని ఆల్ ఇండియా న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, బార్ కౌన్సిల్ మెంబర్ కే సత్యనారాయణ తెలిపారు. న్యాయవాదుల బృందం బుధవారం చెరువు పరిరక్షణ సమితి, అఖిల పక్ష నాయకులతో కలిసి మాసబ్ చెరువులో మట్టిని డంప్ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోర్టు ఉత్తర్వులను పక్కతోవ పట్టిస్తూ, ఎవరు కూడా అందులో కల్పించుకోవద్దని ఉందనే దాన్ని బూచిగా చూపి అన్ని శాఖల అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. చెరువు పరిరక్షణకు న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు. అవినీతి అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, అరుణ్‌కుమార్, రమావత్ కళ్యాణ్‌నాయక్, వీరేశం, బాబు పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- రేపు షాద్‌నగర్‌కు కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ రాక
- బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ ఘోరంగా విఫలమయ్యారని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డీ పవన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ టీ విజయ్‌కుమార్ అధ్యక్షతన పార్లమెంట్ ప్రవాస్ యోజన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులకు కేంద్ర పథకాలు అందేలా చూడాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నేతలు పూర్తి సమయాన్ని కేటాయించి పార్టీకి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫమయ్యారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 19న షాద్‌నగర్‌కు కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే వస్తున్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో మేధావులతో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, ఏ బాబయ్య, పీ విష్ణువర్ధన్‌రెడ్డి, డీ అశోక్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణ, ఎం మురళీ, సాయిబాబ, వెంకటేష్, నర్సింలు యాదవ్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.